AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## డిగ్రీ కాలేజీలో మహిళా దినోత్సవ వేడుకలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యాసరచన, చిత్రలేఖన, హెయిర్ స్టైల్, మెహందీ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ చంద్రకాంత్, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ శంకరయ్య, టీఎస్కేసీ కో–ఆర్డినేటర్ శివకుమార్, మహిళా సాధికారత విభాగం కో–ఆర్డినేటర్ డాక్టర్ గోదావరి, మహిళా సాధికారత విభాగం సభ్యులు నాగానిక, సూపరింటెండెంట్ వసంతలక్ష్మి, రాణి, సంగీత, కీర్తి, స్వప్న, అధ్యాపకులు ప్రభాకర్ రావు, గంగారెడ్డి, సిద్దురాజ్ పాల్గొన్నారు.



## ర్యాగింగ్ ఘటనపై కమిటీ వేశాం



**అక్షరటుడే, కామారెడ్డి:** ఇటీవల సౌత్ క్యాంపస్‌లో జరిగిన ర్యాగింగ్ ఘటనపై యూనివర్సిటీ తరఫున కమిటీ వేశామని ప్రిన్సిపాల్ సుధాకర్ గౌడ్ తెలిపారు. కమిటీ నివేదిక ఆధారంగా తప్పు చేసిన వారిపై చర్యలుంటాయని చెప్పారు. శనివారం సౌత్ క్యాంపస్ లో ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో అధ్యాపకుల సమావేశం నిర్వహించారు. అన్ని అంశాలపై కూలంకషంగా చర్చించి తీసుకోవాల్సిన చర్యలను నిర్ణయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సౌత్ క్యాంపస్‌లో విద్యార్థులు ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడినా, క్రమశిక్షణ ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో హాస్టల్ వార్డెన్లు సునీత, యాలాద్రి, ఏపీఆర్వో సరిత, ఫిజిక్స్ హెడ్ మోహన్ బాబు, సోషల్ వర్క్ హెడ్ అంజయ్య, జియో ఇన్ఫర్మాటిక్స్ హెడ్ సవిత, అధ్యాపకులు హరిత లక్కరాజు, ప్రతిజ్ఞ, నారాయణ, నిరంజన్, వైశాలి పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాల అమలులో ఉద్యోగులదే కీలకపాత్ర



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ప్రభుత్వ పథకాల అమలులో ఉద్యోగులదే కీలకపాత్ర అని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. ఈ మేరకు కామారెడ్డి జిల్లా టీఎన్జీవోస్ డైరీని ఆయన ఆవిష్కరించారు. ఆర్‌అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా టీఎన్జీవోలో మహిళా నాయకురాళ్లను షబ్బీర్ అలీ సన్మానించారు. ఉద్యోగుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కామారెడ్డి మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవేందర్, ప్రధాన కార్యదర్శి సాయిరెడ్డి, గెజిటెడ్ అధికారుల సంఘ సభ్యులు అసోసియేట్ ప్రెసిడెంట్ రాజలింగం, ట్రెజరర్ భూమయ్య, తురబొద్దీన్, రమేష్, ఠాగూర్, శ్రీనివాస్, శశికిరణ్, ప్రశాంత్ రెడ్డి, మౌనిక రెడ్డి పాల్గొన్నారు.

## గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి




**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి సూచించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం జిల్లా అనుబంధ సంస్థ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామ కమిటీలు వేయాల్సిందిగా అయిన సూచించారు. గ్రామస్థాయి నుండి ఆర్గనైజషన్‌ను బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు ఇంటి ఇంటికి చేరవేసే బాధ్యత మనందరిదన్నారు. జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్, గంగాధర్ గౌడ్, యాదగిరి, లింగం, సంతోష్, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు రాజా నరేందర్ గౌడ్ పాల్గొన్నారు.

**ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడానికి ప్రభుత్వం మధ్యాహ్న భోజనం పథకాన్ని కొన్నేళ్లుగా అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా అనేక మందికి ఉపాధి కూడా లభిస్తోంది. అయితే ఈ పథకం అధికారుల పర్యవేక్షణ కొరవడి అబాసుపాలవుతోంది. అక్కడక్కడా విద్యార్థులకు భోజనం వికటించి ఆస్పత్రుల పాలవుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ తరహా ఘటనలు వెలుగు చూస్తున్నా అధికారులు దిద్దుబాటు చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారు.**

**- అక్షరటుడే, కామారెడ్డి**



# పాఠశాలల్లో పర్యవేక్షణ కరువు

■ మధ్యాహ్న భోజనంలో పురుగులు ■ భాగిర్తిపల్లి పాఠశాలలో ఘటన ■ తల్లిదండ్రుల ఆగ్రహం

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తున్నారు. విద్యార్థుల హాజరు ప్రకారం వారికి కావాల్సినంత ఆహారాన్ని వండి పెడతారు. ప్రభుత్వ మెనూ ప్రకారం రోజుకో విధమైన ఆహారాన్ని అందజేస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం కొన్ని పాఠశాలల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదు.

### పురుగుల అన్నం

ఉమ్మడి జిల్లాలో మధ్యాహ్నం భోజనంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా భిక్కనూరు మండలం భాగిర్తిపల్లి గ్రామంలోని ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు పురుగుల అన్నం వడ్డించడం కలకలం రేపింది. విద్యార్థులకు వడ్డించిన అన్నంలో పురుగులు పారుతుండడం స్పష్టంగా కనిపించడంతో అధికారుల పర్యవేక్షణ ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతోంది. అన్నం సరిగా ఉండటం లేదని చెప్పినా పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై విచారణ కొనసాగుతోంది.

### గతంలో సైతం

భోజనంలో పురుగులు రావడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కుళ్లిన కూరగాయలతో వంట చేస్తున్నారని ఆరోపించారు. గతంలో సైతం ఉమ్మడి జిల్లాలోని పలు బడుల్లో విద్యార్థులకు పురుగుల అన్నం పెట్టారు. పలువురు విద్యార్థులు అస్వస్థకు గురైన ఘటనలు కూడా ఉన్నాయి. జనవరి 6న నాగిరెడ్డిపేట మండలం మాల్తుమ్మెద ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో 8 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. అయినా అధికారులు చర్యలు చేపట్టడం లేదు.

### అధికారుల నిర్లక్ష్యమేనా..?

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ఎలా ఉంది.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నారా.. మెనూ అమలు చేస్తున్నారా లేదా అనేది అధికారులు పాఠశాలలను సందర్శించి ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సి ఉంటుంది. అవసరం అయితే విద్యార్థులతో కలిసి అక్కడే భోజనం చేయాల్సి ఉంటుంది. అయితే అధికారులు క్షేత్రస్థాయిలో మాత్రం ఎక్కడా మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన దాఖలాలు కనిపించడం లేదు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## పురుగుల అన్నం ఘటనపై విద్యాశాఖ చర్యలు.. మధ్యాహ్న భోజన ఏజన్సీ రద్దు..



**అక్షరటుడే, కామారెడ్డి:** భిక్కనూరు మండలం భాగిర్తిపల్లి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజనంలో పురుగులు ప్రత్యక్షమైన ఘటనలో అధికారులు విచారణ జరిపారు. శనివారం కామారెడ్డి ఆర్డీఓ వీణ పాఠశాలకు వెళ్లి విచారణ చేపట్టారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారీ, పంపిణీలో పరిశుభ్రత పాటించకుండా పర్యవేక్షణలో లోపాలు ఉన్నట్టుగా గుర్తించారు. ఆర్డీవో నివేదిక ఆధారంగా వెంటనే సంబంధిత భోజన ఏజన్సీని రద్దు చేస్తున్నట్టు జిల్లా విద్యాశాఖ అధికారి రాజు ప్రకటించారు. ఆహార నాణ్యతా లోపం, పర్యవేక్షణ చేయకపోవడం, పరిశుభ్రత ప్రమాణాలు పాటించడంలో విఫలమైన పాఠశాల ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకుంటామని డీఈవో పేర్కొన్నారు.



## యూరియా కోసం అన్నదాతల కష్టాలు.. చెప్పులతో క్యూలైన్..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** యూరియా కోసం రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన యాప్‌లో యూరియా బుక్ చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. సొసైటీకి వచ్చిన యూరియా ను దక్కించుకునేందుకు ఆయా కేంద్రాల వద్ద తెల్లవారుజాము నుంచే రైతులు క్యూ కడుతున్నారు. గంటల తరబడి నిరీక్షణ తప్పకపోవడంతో, లైన్‌లో తమ స్థానాన్ని రిజర్వ్ చేసుకోవడానికి గండి మాసానిపేట సింగిల్ విండో కార్యాలయం వద్ద శనివారం చెప్పులను క్యూలో పెట్టి రైతులు యూరియా కోసం పడిగాపులు కాశారు. పంట కాలంలో ఎరువులు అందక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి ఇబ్బందులు లేకుండా యూరియా అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎల్లారెడ్డి మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ భాగ్యమ్మ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు శాలువాలు పూలబొకేలు అందజేసి సన్మానించారు. అనంతరం మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ భాగ్యమ్మ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ తమకు తాముగా ప్రత్యేక గుర్తింపును తీసుకొస్తున్నారని తెలిపారు. మహిళలను అన్ని రంగాల్లో రాణించేందుకు వారి కుటుంబ సభ్యులు ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గాయత్రి శ్యాం, మహేశ్వరి, సిద్ది శ్రీధర్, గఫార్, తిరుపతి, మున్సిపల్ కమిషనర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణా నిరోధానికి చెక్‌పోస్ట్



**అక్షరటుడే, బోధన్:** ఇసుక అక్రమ రవాణా నిరోధానికి చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు టీజీఎండీసీ మేనేజింగ్ డైరెక్టర్ భవేష్ మిశ్రా పేర్కొన్నారు. జిల్లా సరిహద్దులోని సాలూర వద్ద టీజీఎండీసీ ఆధ్వర్యంలో ఇంటర్ స్టేట్ చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేయగా.. ఇలా త్రిపాఠి తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ చెక్ పోస్ట్ వద్ద వేయింగ్ మెషిన్‌తో ఇసుక వాహనాల తనిఖీలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశామని భవేష్ మిశ్రా తెలిపారు. తద్వారా అక్రమ ఇసుక రవాణాతో పాటు, ఓవర్ లోడింగ్‌ను సైతం నిరోధించేందుకు ఆస్కారం కలుగుతుందన్నారు. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుని మహారాష్ట్ర నుంచి నిర్ణీత పరిమాణంలో నిబంధనలకు అనుగుణంగా ఇసుకను తరలించవచ్చని.. అయితే సాలూర చెక్‌పోస్ట్ వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ఇదివరకు చెక్‌పోస్ట్ లేకపోవడం వల్ల ఇసుక రవాణా విషయంలో పలు అక్రమాలు జరిగేవని, ఈసారి అలాంటి వాటికి ఆస్కారం లేకుండా రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన సాలూర వద్ద జిల్లా యంత్రాంగం సహకారంతో ప్రత్యేకంగా చెక్ పోస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనివల్ల అక్రమ ఇసుక రవాణాను అడ్డుకోవడంతో పాటు తెలంగాణ ప్రభుత్వానికి ఆదాయం సమకూరనుందని తెలిపారు. అంతేకాకుండా ఓవర్ లోడ్ సమస్యను నిరోధించడం ద్వారా రోడ్లు చెడిపోకుండా, రోడ్డు ప్రమాద సంఘటనలు జరుగకుండా నిలువరించవచ్చన్నారు. అదేవిధంగా నిజామాబాద్‌కు సమీపంలోనే మహారాష్ట్ర ఇసుక క్వారీలు ఉన్నందున ఇసుక అవసరమైన వారికి తక్కువధరకే ఇసుక లభ్యం అయ్యేందుకు అవకాశం ఉంటుందన్నారు. మంజీరా లో ఇసుక తవ్వకాలకు సంబంధించి సరిహద్దు సమస్య తలెత్తకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో పకడ్బందీ చర్యలు తీసుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో మైనింగ్ ఏడీ సంజయ్, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ అశోక్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయాల్లో టీచర్ల భర్తీకి ఇంటర్వ్యూలు

**అక్షరటుడే, ఇందూరు:** పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం నిజామాబాద్, బోధన్‌లలో కాంట్రాక్ట్ పద్ధతిన ఉపాధ్యాయులను భర్తీ చేయనున్నారు. ఈ మేరకు శనివారం విద్యాలయం ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు ప్రకటన విడుదల చేశారు. కాంట్రాక్ట్ పద్ధతిన ఆయా విద్యాలయాల్లో ఉపాధ్యాయుల నియామకానికి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 9న నిజామాబాద్ నగరంలోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో ఉదయం 9గంటల నుంచి ఇంటర్వ్యూలు ఉంటాయని ఆయన తెలిపారు. ఆయా విద్యాలయాల్లో ప్రైమరీ టీచర్ (పీఆర్‌టీ), టీజీటీ (ఇంగ్లిష్, హిందీ, సంస్కృతం, గణితం, సైన్స్, సోషల్ సైన్స్), తెలుగు లాంగ్వేజ్ ఇన్‌స్ట్రక్టర్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, ఏటీఎల్ ఇన్‌స్ట్రక్టర్ (ఏటీఎల్) , వొకేషనల్ ఇన్‌స్ట్రక్టర్, ఎడ్యుకేషనల్ కౌన్సిలర్, స్పెషల్ ఎడ్యుకేటర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈ నియామకాలు పూర్తి పారదర్శకంగా జరుగుతాయని, సీటీఈటీ ఉత్తీర్ణులకు ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. అభ్యర్థులు ఉదయం 9 గంటల నుంచి ఒరిజినల్ విద్యార్హతలు, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలు పాఠశాల వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## సీఎం మాట నిలబెట్టుకున్నారు..: షబ్బీర్ అలీ



**అక్షరటుడే, కామారెడ్డి:** సీఎం రేవంత్ రెడ్డి పాదయాత్ర సమయంలో.. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో శనివారం భిక్కనూర్ లక్ష్మీ, చిట్యాల రాజమణిలకు సంబంధించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం కార్యక్రమంలో షబ్బీర్ అలీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం ఆదేశాల మేరకు లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు, వస్త్రాలు అందజేశారు. అనంతరం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కతో ఫోన్ చేసి మాట్లాడించారు. లబ్ధిదారులకు మంత్రి సీతక్క శుభాకాంక్షలు తెలిపారు. షబ్బీర్ అలీ మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో.. కూలిపోయిన ఇళ్లను చూసి సీఎం రేవంత్ రెడ్డి చలించిపోయారన్నారు. అధికారంలోకి రాగానే ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశం చేయడం జరిగిందని షబ్బీర్ అలీ తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ మధు మోహన్, గ్రామ సర్పంచ్ లక్ష్మి, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్, మున్సిపల్ ఛైర్మన్ ఇప్ప ఉమారాణి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ లక్ష్మి పాల్గొన్నారు.

## బ్రాహ్మణ కార్పొరేటర్‌కు ఘనసన్మానం



**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 50వ డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా జగదీష్ కులకర్ణి విజయం సాధించారు. ఈ సందర్భంగా శనివారం బ్రాహ్మణ సంక్షేమ సంఘం సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సంఘం ఇందూరు అధ్యక్షుడు శశికాంత్ కులకర్ణి, ప్రధాన కార్యదర్శి రమేష్ కులకర్ణి, నాయకులు కిరణ్ దేశ్‌ముఖ్, మిలింద్, అజయ్ సాంగ్వాయ్, వెంకట్‌రావు కులకర్ణి, లక్ష్మీనారాయణ భరద్వాజ్ పాల్గొన్నారు.

## కొత్త పాలసీ ప్రకారం ఇసుక రవాణా ప్రారంభం



**అక్షరటుడే, మెండోరా:** మండలంలోని వెల్కటూర్ గ్రామ వాగు నుంచి కొత్త ఇసుక పాలసీ ప్రకారం శనివారం నుంచి ఇసుక రవాణాను ప్రారంభించారు. మెండోరా మండల తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న వారికి అనుమతులు జారీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ఇకపై కొత్త విధానంలో యాప్ ద్వారా బుకింగ్ చేసుకున్న వారికి మాత్రమే ఇసుక రవాణాకు అనుమతి ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వేణుపాల చారి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** విద్యార్థులకు రెసిడెన్షియల్ పాఠశాలలో అన్ని వసతులు సక్రమంగా కల్పించాలని ఎంపీడీవో సహారా బేగం ఉపాధ్యాయులకు సూచించారు. మైనారిటీ పాఠశాలను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ప్రిన్సిపాల్‌కు ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు సిద్ధమయ్యేలా చూడాలని సూచించారు. ఆమెతో పాటు అధికారి ప్రకాష్, ఉపాధ్యాయులు ఉన్నారు.

## ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేయాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీలో భవనాన్ని అన్ని హంగులతో నిర్మించాలని ఛైర్‌పర్సన్ రజిత వెంకట్‌రామిరెడ్డి అన్నారు. మార్కెట్ కమిటీ బడ్జెట్ మీటింగ్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా జేడీ మల్లేశంను ఛైర్‌పర్సన్ రజిత వెంకట్‌రామిరెడ్డి సన్మానించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వేయింగ్ మిషన్లు ఏర్పాటు చేయాలని, మూత్రశాలల నిర్వహణకు నిధులు మంజూరు చేయాలని కోరారు. రైతు బజార్‌కు సైతం ప్రహరీ నిర్మాణానికి నిధులివ్వాలన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ అధికారులు పాల్గొన్నారు.

**లక్ష్యం పెద్దదైతే సరిపోదు.. దాన్ని చేరుకోవాలంటే అంతకుమించి పట్టుదల ఉండాలని నిరూపించాడు నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం ముచ్కూర్‌కు చెందిన శనిగరం వర్షిత్ రెడ్డి. కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ తాజాగా విడుదల చేసిన ఫలితాల్లో ఆలిండియా 259వ ర్యాంకు సాధించి, దేశ అత్యున్నత సర్వీసులకు ఎంపికయ్యాడు. ఒక సామాన్య గ్రామం నుంచి వచ్చి, దేశస్థాయి పోటీ పరీక్షలో మెరవడం ద్వారా వర్షిత్ రెడ్డి నిజామాబాద్ జిల్లా యువతకు రోల్ మోడల్‌గా నిలిచాడు.** - భీమ్‌గల్, అక్షరటుడే



## ముచ్కూర్ మట్టిలో విరిసిన..

# సివిల్స్ కుసుమం

- యూపీఎస్సీలో 259వ ర్యాంకు సాధించిన శనిగరం వర్షిత్ రెడ్డి
- ఉద్యోగం చేస్తూనే ఉన్నత లక్ష్యం వైపు..
- హర్షం వ్యక్తం చేస్తున్న ముచ్కూరు ప్రజలు

వర్షిత్ రెడ్డి ప్రాథమిక విద్యాభ్యాసం నుంచే చదువులో చురుగ్గా ఉండేవారు. హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక బిట్స్ క్యాంపస్‌లో 2023లో ఇంజినీరింగ్ పూర్తి చేసిన ఆయన, కార్పొరేట్ కొలువుల వైపు వెళ్లకుండా దేశ సేవ చేయాలనే సంకల్పంతో సివిల్స్ బాట పట్టారు. పట్టువదలని విక్రమార్కుడిలా శ్రమించి, తన మూడవ ప్రయత్నంలో ఈ ఘనత సాధించారు.

### ఉద్యోగం చేస్తూనే ఉన్నత లక్ష్యం వైపు..

కేవలం సివిల్స్ కోసమే వేచి చూడకుండా.. తన ప్రతిభతో 2025లో కస్టమ్స్ విభాగంలో జీఎస్టీ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్‌గా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం విజయవాడలో బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ, తన లక్ష్యమైన యూపీఎస్సీ కోసం నిరంతరం శ్రమించారు. విధి నిర్వహణలో ఉంటూనే సమయాన్ని సమర్థవంతంగా వినియోగించుకుని చదువుకున్నాడు. సివిల్స్‌లో 259వ ర్యాంకుతో తన కలను నిజం చేసుకున్నాడు.

### హర్షాతిరేకాలు..

వ్యాపారవేత్త శనిగరం నవీన్ రెడ్డి, కవిత రెడ్డి దంపతుల కుమారుడైన వర్షిత్ విజయం పట్ల ముచ్కూర్ గ్రామస్థులు సంబరాలు చేసుకుంటున్నారు. ఒక సామాన్య కుటుంబం నుంచి వచ్చిన యువకుడు దేశంలోనే అత్యున్నతమైన అధికారిగా మారబోతుండడం తమ గ్రామానికే గర్వకారణమని యువత హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షిత్ రెడ్డి కుటుంబ సభ్యులను గ్రామ పెద్దలు, యువకులు కలిసి ప్రత్యేకంగా అభినందించారు. కష్టపడి చదివితే గ్రామీణ విద్యార్థులకు అసాధ్యమైనది ఏదీ లేదని వర్షిత్ రెడ్డి నిరూపించాడని వారు కొనియాడారు.

## ప్రతి విద్యార్థి గణితంలో పట్టు సాధించాలి



**అక్షరటుడే, లింగంపేట:** ప్రతి విద్యార్థి గణితంలో పట్టు సాధించాలని ఎంఈవో అంజల్ రెడ్డి అన్నారు. లింగంపేట మండలం ఎల్లారం ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. గణిత ఉపాధ్యాయుడు అచ్యుతారాం తరగతిలో బోధనను సమీక్షించి విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు జవాబులు ఇవ్వడంతో ఎంఈవో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నాగంపేట్‌లో ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక



**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని నాగంపేట్‌లో 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం గురించి, అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి గంగాధర్, ఎంపీవో గౌస్ మోహినొద్దీన్, కార్యదర్శి గౌతమి పాల్గొన్నారు.

## రెంజర్లలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని రెంజర్ల గ్రామంలో పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల సాధికారత, సమాజ అభివృద్ధిలో వారి పాత్రపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ లావణ్య భూమేశ్వర్, ఉప సర్పంచ్ ఆకుల రాజేందర్, పంచాయతీ కార్యదర్శి నరేష్, గ్రామస్థాయి అధికారులు, వార్డు సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిలో కొనసాగుతున్న స్వచ్ఛత కార్యక్రమం




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పట్టణంలో శనివారం రెండోరోజు పరిశుభ్రత పచ్చదనం కార్యక్రమాన్ని ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కళాశాలలోని తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాన్ని శుభ్రపర్చారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకాంత్ మాట్లాడుతూ విద్యాసంస్థలు పరిశుభ్రంగా ఉండడం విద్యార్థుల ఆరోగ్యం, చదువుకు ఎంతో అవసరమన్నారు. కళాశాల అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ సమన్వయకర్త శంకరయ్య, టీఎస్‌కేసీ సమన్వయకర్త శివకుమార్, ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ప్రోగ్రాం ఆఫీసర్ రాణి, సిద్ధు రాజు, గంగారెడ్డి, గోదావరి, కృష్ణ ప్రసాద్, స్వప్న, సురేష్ రెడ్డి, కిరణ్ కుమార్ దశరథ్, మహమూద్, రాజు తదితర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉరివేసుకుని యువకుడి బలవన్మరణం..

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** ఉరివేసుకుని యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. నగరంలోని ఐదో టౌన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమ స్టేషన్ పరిధిలోని సీతారాంనగర్‌లోని ఓ ఇంట్లో యువకుడు రాకేష్(28) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా సమాచారం వచ్చింది. దీంతో వెంటనే సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. యువకుడి మృతిపై విచారణ చేపట్టారు. రాకేష్ కుటుంబంలో తరచూ గొడవలు జరిగేవని స్థానికులు పేర్కొన్నారు. కుటుంబంలో మనస్పర్థలు, ఆర్థిక ఇబ్బందులు కారణమై ఉండవచ్చని వారు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పోలీసులు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాకేష్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ఐదో టౌన్ పోలీసులు విచారణ చేపట్టారు.

## పేదోడి సొంతింటి కలను నెరవేరుస్తున్న రేవంత్ రెడ్డి




**అక్షరటుడే, భీమ్‌గల్:** సొంత ఇల్లు అనేది ప్రతి పేద కుటుంబానికి ఒక కల అని, ఆ కలను ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా సీఎం రేవంత్ రెడ్డి నెరవేరుస్తున్నారని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి అన్నారు. భీమ్‌గల్‌లోని బీసీ కాలనీలో శనివారం దర్శనం గోదావరి నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ ఛైర్మన్ కుంట రమేష్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానాల మాట్లాడుతూ గత పదేళ్లలో పేదవాడికి ఇల్లు అనేది ఒక తీరని కలగానే మిగిలిపోయిందని విమర్శించారు. నేడు ఇందిరమ్మ ఇల్లు రూపంలో తమ కల నెరవేరడంతో పేద ప్రజలు ఆనందభాష్పాలతో సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి పేదవాడికి సొంత ఇల్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఏప్రిల్‌లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులు మల్లేష్, నరేందర్, సర్పంచులు నవీన్, ప్రశాంత్, ఉప సర్పంచ్ నవీన్, ఇందిరా కమిటీ సభ్యులు రమణ, రాజేందర్, రాజేశ్వర్, లహరి, లావణ్య, కిసాన్ సెల్ మండల ప్రెసిడెంట్ రవి, మహిళా అధ్యక్షురాలు స్వరూప, నాయకులు పాల్గొన్నారు.

## పీడీఎస్‌యూ జాతీయ కమిటీ సభ్యుడిగా అనుముల రవీందర్




**అక్షరటుడే, గాంధారి:** పీడీఎస్‌యూ జాతీయ కమిటీ సభ్యుడిగా అనుముల రవీందర్ ఎన్నికయ్యారు. పీడీఎస్‌యూ ప్రథమ జాతీయ మహాసభలు మార్చి 3, 4 తేదీల్లో విజయవాడలోని సింగ్ నగర్‌లో జరిగాయి. ఈ మహాసభల్లో కామారెడ్డి జిల్లా గాంధారి మండలం దుర్గం గ్రామానికి చెందిన ఎ.సతీష్ అలియాస్ రవీందర్‌ను జాతీయ కమిటీ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2010లో ఇంటర్ ఫస్టియర్‌నుంచి సాధారణ కార్యకర్తగా ఉద్యమ జీవితం ప్రారంభించిన సతీష్ విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ జిల్లాస్థాయి నుండి రాష్ట్రస్థాయికి ఎదిగారు. ప్రస్తుతం జాతీయ స్థాయిలో ఆయనకు పదవి వరించింది. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. అందరికీ సమాన విద్య అందేలా సంఘాన్ని బలోపేతం చేయడానికి కృషిచేస్తానన్నారు. ఉమ్మడి నిజామాబాద్‌లో ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని.. ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## నాగాపూర్ వెంకటేశ్వర ఆలయంలో అన్నదానం



**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని నాగాపూర్ గ్రామంలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతినెలా మొదటి శనివారం దాతల సహకారంతో అన్నసత్రం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారిని ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాన్ని సంజీవ్ పంత ఆధ్వర్యంలో నిర్వహించారు.

## భీమ్‌గల్ మండలంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు




**అక్షరటుడే, భీమ్‌గల్:** 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా శనివారం భీమ్‌గల్ మండల వ్యాప్తంగా పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, మార్కెట్ ఏరియాలు, బస్టాండ్లతో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలను పంచాయతీ సిబ్బంది శుభ్రం చేశారు. ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్, ఎంపీవో జావిద్ అలీలు బాచంపల్లి, పల్లికొండ గ్రామాల్లో పర్యటించి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ సంస్థల పరిసరాల్లో పిచ్చిమొక్కలను తొలగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా ఈ 99 రోజుల ప్రణాళిక కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## హాస్టళ్లను తనిఖీ చేసిన ఎంఈవో..



**అక్షరటుడే, బాల్కొండ:** బాల్కొండ మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌ను శనివారం ఎంఈవో బట్టు రాజేశ్వర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు పాఠశాలలో విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కేర్ టేకర్‌ను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. మోడల్ స్కూల్ బాలికల హాస్టల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, సమీకృత బాలుర సంక్షేమ వసతి గృహం, మహాత్మ జ్యోతిబాపూలే బాలికల హాస్టల్‌లను ఎంఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా బాలికల హాస్టల్‌లో మెనూకు సరిపడా సరుకులు అందుబాటులో లేకపోవడం, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించకపోవడాన్ని గమనించారు. అలాగే విద్యార్థులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తున్న కేర్‌టేకర్‌ను తొలగించాలని ఎంఈవో ఆదేశించారు.

## ఆలూర్‌లో ముగిసిన శిక్షణ తరగతులు




**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండల కేంద్రంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన వార్డు మెంబర్ల శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో గంగాధర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు గ్రామ స్థాయిలో సమర్థవంతంగా అమలవ్వాలంటే అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రజలకు అందించే సేవల్లో పారదర్శకత, బాధ్యతాయుతమైన విధానం ఉండాలని సూచించారు. ఈ ఐదు రోజుల శిక్షణ ద్వారా అధికారులకు పలు అంశాలపై పూర్తిస్థాయి అవగాహన కలిగిందని, భవిష్యత్తులో గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలులో ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. అలాగే ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడం అధికారుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, రామకృష్ణ, చంద్రశేఖర్, దినేష్, వందన, రామాగౌడ్, నాగేంద్ర, నసీర్, కిషోర్ పాల్గొన్నారు.